తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం 31 మే 2026 | పేజీలు : 08



## మీనాక్షి నటరాజన్‌తో నవాబుపేట్ కాంగ్రెస్ నేతల భేటీ

- నూతన మండల అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డికి అభినందనలు
- పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్న భరోసా
- పార్టీ మారే నాయకులను పట్టించుకోవద్దని సూచన
- క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

**నవాబుపేట్, మే 30 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అను నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సామ వెంకట్‌రెడ్డిని ఆమె అభినందించారు. మండల స్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తల పాత్ర, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు ఆమెతో చర్చించారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అహర్నిశలు శ్రమించామని, క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించామని నాయకులు వివరించారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభించాలని కోరారు. దీనికి స్పందించిన మీనాక్షి నటరాజన్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు అధిష్ఠానం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారాల కోసం పార్టీలు మారే నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నవాబుపేట్ గ్రామ సర్పంచ్ గాజులగూడెం నర్సింహారెడ్డి, జిల్లా నాయకులు సామ సంజీవ్‌రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కర్ణం రఘు పాల్గొన్నారు.




## మీ రక్షణ - మా బాధ్యత

**హయత్ నగర్, మే 30 (జనంసాక్షి) :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూర్‌లోని ప్రజయ్ గుల్మోహర్ గ్రేటెడ్ కమ్యూనిటీలో శనివారం రాత్రి నిర్వహించిన "మీ సురక్ష - మా బాధ్యత" కార్యక్రమానికి వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి, హయత్ నగర్ ఎస్ హెచ్ ఓ నాగరాజు గౌడ్, పోలీస్ సిబ్బంది హాజరై, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లలో పనిచేసే పని మనుషుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వారి పూర్తి వివరాలు గూగుల్ లింకు ద్వారా అప్లోడ్ చేయాలని కోరారు. వారి ఆధార్ కార్డులను, మొబైల్ నెంబర్లను, వారికి తెలిసిన వారి రిఫరెన్స్ తీసుకోవాలని తెలిపారు. అనుమానిత, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వారు తెలియజేశారు. గ్రేటెడ్ కమ్యూనిటీలలో 24 గంటలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని వారు సూచించారు.

### బొంరాస్ పేటలో 13వ రోజుకు చేరిన వివోఏల సమ్మె

**బొంరాస్ పేట, మే 30 ( జనం సాక్షి):** మండల కేంద్రంలో ఐకెపి వివోఏలు చేస్తున్న సమ్మె 13 రోజులకు చేరింది. శనివారం సమ్మెలో భాగంగా వివోఏలు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హత కలిగిన వివోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య నాయక్, రూప్లా నాయక్, నాగ భూషణం, రామచందర్, చరిత, దేవమ్మ, మహాలక్ష్మి, వనిత, నీలిమ, రూప, శైలజ, నరేష్, బసప్ప, మల్కప్ప, తారా సింగ్, రమణ, లాలప్ప, వీరేశం, రవి నాయక్, పాండు నాయక్, వెంకటయ్య, కృష్ణ, రాములు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం డిపోలో ఘనంగా ఏడీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

**ఇబ్రహీంపట్నం, మే 30 (జనం సాక్షి):** ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఏడీసీలుగా బాధ్యతలు నిర్వహించి, తమ వృత్తినే దైవంగా భావిస్తూ నిబద్ధతతో సేవలందించిన ఎం. దుశ్శాసన్ మరియు టి. వీరన్న శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో వారి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీర్ఘకాలంగా ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ఈ ఇద్దరు అధికారులు విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీకి మారుపేరుగా నిలిచారని పలువురు అధికారులు, ఉద్యోగులు కొనియాడారు. తమ సేవా కాలంలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సహచర ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఆదర్శవంతమైన సేవలను అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం



అధికారులు, ఉద్యోగులు వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ మరణం బాధాకరం

### హయత్ నగర్ ఎస్‌హెచ్‌ఓ నాగరాజు గౌడ్

**హయత్ నగర్, మే 30 (జనంసాక్షి) :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఈ సుధాకర్ వయస్సు 55 సం. రాలు శుక్రవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం అత్యంత విచారకరం అని హయత్ నగర్ ఎస్ హెచ్‌ఓపి నాగరాజు గౌడ్ దిగ్భ్రాంతిని తెలిపారు. 1993 నల్గొండ బ్యాచ్ కు చెందిన సుధాకర్, పోలీసు శాఖలో తన విధులను నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో నిర్వర్తించి, సహచరుల అభిమానాన్ని పొందారు. ప్రస్తుతం ఆయన సూర్యాపేట టౌన్‌లో తన భార్య, కుమారుడు, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం వారి భౌతికకాయాన్ని సూర్యాపేటకు తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వారి స్వగ్రామం బుర్కచర్ల , మోతే మండలం, సూర్యాపేట జిల్లా. సుధాకర్ ఆకస్మిక మరణం పోలీసు శాఖకు, సహచర ఉద్యోగులకు తీరని లోటని, వారి సేవలు, క్రమశిక్షణ, సౌమ్య స్వభావం ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చి, కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము. ప్రభుత్వ నిబంధనల మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ద్వారా రూ.30,000/- ఫ్యూనరల్ అసిస్టెన్స్‌కు కుటుంబ సభ్యులకు ఎస్‌హెచ్‌ఓ నాగరాజ్‌గౌడ్ అందజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఘననివాళులు అర్పించారు.

## జూన్ 17, 18 తేదీలలో లియాఫీ ఆల్ ఇండియా

### జనరల్ బాడీని జయప్రదం చేయండి : షేక్ షాజహాన్, కొనతం పాపయ్య నాయుడు



**హయత్ నగర్, మే 30 (జనం సాక్షి) :** ఆల్ ఇండియా జనరల్ బాడీ సమావేశం జూన్ 17, 18 తేదీలలో హైదరాబాదులోని నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నిర్వహించడానికి, చంపాపేటలోని లియాఫీ బిల్డింగ్ లో సన్నాహక సమావేశాన్ని నిర్వహి ంచి, బ్యానర్‌లను విడుదల చేశారు. ఆల్ ఇండియా జనరల్ బాడీ మీటింగ్‌కి సెంట్రల్ మినిస్టర్ కిషన్ రెడ్డిని లియాఫీ ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ సమావేశంలో లియాఫీ 1964 ఆల్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఎస్ బి శ్రీనివాస చారి, ఆల్ ఇండియా లీడర్స్ సింగారం శ్రీనివాస్, షేక్ షాజహాన్, అశోక్ కుమార్, కోటిరెడ్డి, జోనల్ లీడర్స్, డివిజన్ లీడర్స్, బ్రాంచ్ లీడర్స్ ఆల్ ఇండియా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయుటకు కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల వారీగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని, దాదాపు 3500 ఏజెంట్ లీడర్స్ ఆల్ ఇండియా నుండి వస్తారని, మీటింగును సక్సెస్ చేయుటకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ లు షేక్ షాజహాన్, కొనతం పాపయ్య నాయుడు లు తెలియజేశారు.

# ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ సమానమే

**• చౌదర్ పల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం • తలకొండపల్లి తహసిల్దార్ కే.రమేష్**



**తలకొండపల్లి మే 30 (జనంసాక్షి)** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలందరూ సమానమే అని,అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తలకొండపల్లి తాహసిల్దార్ కే.రమేష్ పిలుపునిచ్చారు.శనివారం పౌరుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చౌదర్ పల్లి,లో గ్రామ సర్పంచ్ మేరిగా భారతమ్మ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాహసిల్దార్ కే.రమేష్,అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొని పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో ఎవ్వరి హక్కులకు భంగం కలిగించొద్దని,రాజ్యాంగం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిందని,ఒకవేళ చట్టాన్ని అతిక్రమించి హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కుల,మత,వర్ణ,బేధం,వివక్ష,అంటరానితనం నిర్మూలనకు గ్రామంలోని ప్రజలందరూ సహకరించాలన్నారు.గ్రామంలో కుల,మతాలకు అతీతంగా కలిసిమెలిసి సోదరా భావంతో మేలగాలన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని కోరారు.అనంతరం మొదటిసారిగా గ్రామానికి వచ్చిన తహసిల్దార్ కే.రమేష్,ఆర్ఐ శ్రావణ్ కుమార్,లను సర్పంచ్,ఉపసర్పంచ్,లు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేరిగా భారతమ్మ గోపాల్,ఉపసర్పంచ్ తడిసిన జ్యోతి ప్రదీప్ రెడ్డి,మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ శ్రవణ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి మహేందర్,జిపిఓ రమేష్ యాదవ్, వార్డు సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి సుమతమ్మ,తూర్పు శివలక్ష్మి శ్రీను,మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి,అంగన్వాడీ టీచర్ నిర్మల,ఆశా వర్కర్ మాధవి,ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ,రేషన్ డీలర్ చుక్కయ్య,నాయకులుభూపాల్‌రెడ్డి,దుడ్డుమల్లయ్య,నరసింహ,మల్లయ్య, ఒగ్గులక్ష్మమ్మ,సత్తెమ్మ,అంజమ్మ,జంగమ్మ,అలివేల,పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బంట్వారం మండలంలో కొనసాగుతున్న వివోఎల సమ్మె



**బంట్వారం మే 30 (జనం సాక్షి)** బంట్వారం మండలంలో గ్రామ సంస్థల సహాయకులు (వివోఏలు) చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వివోఏలు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు వివోఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెస్ఆర్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వివోఏలకు సీసీ లుగా పదోన్నతులు కల్పించడంతో పాటు సాధారణ మరియు ఆరోగ్య బీమా రూ.20 లక్షల వరకు వర్తింప చేయాలని కోరారు. అలాగే ట్యాబ్ సౌకర్యం కల్పించి, 58 జీవోను సవరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మెలో వివోఏలు మచ్చేందర్, సుభాష్, ఆశీరెడ్డి, జయమ్మ, సునంద, ఇందిర జ్యోతి, నరేందర్, రామకృష్ణ, రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో కూలీ మృతి



**బంట్వారం మే 30 (జనం సాక్షి)** బంట్వారం మండలంలో ఎండలో కూలి పని చేస్తూ వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా.. తోర్మామిడి గ్రామానికి చెందిన మొండి నరేష్(45) నిత్యం కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఎండ తీవ్రతకు గురై అతడు మరణించగా.. మృతుడి కుమారుడు మొండి భరత్ ఫిర్యాదు మేరకు బంట్వారం ఎస్సై విమల కేసు నమోదు చేశారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# ఇంటర్మీడియట్‌లో బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకంకు స్వీకారం

**• రేవంత్ సర్కార్ నిర్ణయాలు ఆమోగం • కాంగ్రెస్ బంట్వారం మండల యువ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి**



**బంట్వారం మే 30 (జనం సాక్షి)** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు పాలు, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థుల శ్రేయస్సును పెంపొందిస్తుందని కాంగ్రెస్ మండల యువనాయకులు హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సెమీ రెసిడెన్షియల్ క్యాంపస్లను కూడా ఏర్పాటు చేస్తోందన్నారు. అల్పాహార పథకం రాష్ట్రంలోని సుమారు 25,000 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు వారానికి ఆరు రోజుల పాటు వేడివేడిగా, పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, పాలు అందించనున్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు బ్రేక్ పాస్ట్ మధ్యాహ్న భోజన పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి జూన్ 12 వ తేదీన ప్రారంభిస్తారన్నారని తెలిపారు. విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకుండా ఏకగ్రత తో చదవే విధంగా పాఠశాలలోనే మినీ లైబరి సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. కళాశాల విద్యార్థులకు ఏ రాష్ట్రంలో కూడా బ్రేక్ పాస్ట్ పథకం లేదని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు రుచికరమైన పోషకాలతో కూడిన బ్రేక్ పాస్ట్ పథకం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిర్ణయం అభినందనీయమన్నారు. ఇంటర్మీడియట్ అంటే కౌమార దశ 15 నుంచి 18 ఏండ్లు ఉన్న విద్యార్థులకు శారీరికంగా, మానసికంగా ఎదిగే దశ లో పోషకహారం అసరమనీ, ఈ బ్రేక్ పాస్ట్ పథకం మధ్యన భోజనం పథకానికి రూపకల్పన చేశారన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు పోషకాహారంతో కూడిన ఆహారం అందించాలని బ్రేక్ పాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని సీఎం రేవంత్ సర్కార్ ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

# బంట్వారం మక్కల కొనుగోలు కేంద్రం పరిశీలన



**బంట్వారం మే 30 (జనం సాక్షి )** బంట్వారంలోని పిఏసిఎస్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచారం యాదగిరి పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. తూకాల్లో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. రైతులకు మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. గోదాం లేక ధాన్యాన్ని బయట నిల్వ చేయాల్సి వస్తోందని తెలిపారు. గోదాం నిర్మాణానికి నిధులు మంజూరుకై స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# బౌద్ధ నగర్ డివిజన్ ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూడాలి: మేకల కీర్తిహర్షకిరణ్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** బౌద్ధ నగర్ డివిజన్ ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూడాలని బిజెపి మహిళా నాయకురాలు కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సరిపడా త్రాగునీటిని సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డివిజన్ పరిధిలోని సంజీవపురం, ఈశ్వరీబాయి నగర్ లో నెలకొన్న మంచినీటి సమస్యపై బిజెపి సీనియర్ నాయకులు మేకల హర్షకిరణ్ తో కలిసి ఆమె తార్నాక వాటర్ వర్క్స్ డిజిఎం షంషేర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత మూడు రోజులుగా సంజీవపురం, ఈశ్వరీబాయి నగర్‌లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లో లో-ప్రెజర్‌తో కేవలం 20 నిమిషాలు మాత్రమే నీరు వదలడం జరుగుతుందన్నారు. కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తాగునీటి కష్టాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి సకాలంలో సరిపడా నీరు సరఫరా చేయాలని కోరారు. సమస్యపై డిజిఎం సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండా అని, అధికారంలో ఉన్నా లేకున్నా తాను ప్రజల పక్షాన నిలబడతానని ఆమె తెలిపారు.

# కార్మిక సమస్య పోరాట జెండా సిఐటియు




**షాబాద్, మే 30(జనం సాక్షి) ;** కార్మిక సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేసే జెండా సిఐటియు అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని చర్లగూడెంలో శనివారం సిఐటియు 56వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిఐటియు 1970 మే 30వ తేదీన కలకత్తా నగరంలో ఏర్పడిందని, అప్పటినుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ దేశంలోనే అతిపెద్ద కేంద్ర కార్మిక సంఘంగా ఎదిగిందని అన్నారు. సిఐటియు ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక హక్కుల కోసం, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక హక్కుల కోసం, అసంఘీత రంగంలో పనిచేస్తున్న కార్మికల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యం చేసి మోడీ ప్రభుత్వం పై పోరాటం చేయాలని కార్మిక హక్కులను రక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు ఇన్సూరెన్స్ కార్డులు చేయించుకోవాలి: నర్రా గిరి



**శంషాబాద్, మే30(జనంసాక్షి)** భవన నిర్మాణ ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్ కార్డులను తప్పనిసరిగా చేయించుకోవాలని భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకుడు నర్రా గిరి పిలుపునిచ్చారు.శనివారం శంషాబాద్ మండల కేంద్రంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ బోర్డు ద్వారా పలు సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా, సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం, ప్రమాదంలో అంగవైకల్యం చెందితే రూ.5 లక్షల సహాయం అందుతుందని పేర్కొన్నారు. అలాగే కార్మికుల పిల్లల వివాహాలకు రూ.30 వేల వివాహ ప్రోత్సాహకం, మహిళా కార్మికులకు రూ.30 వేల ప్రసూతి సహాయం, ప్రమాదం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందే సమయంలో రోజుకు రూ.300 చొప్పున చికిత్స భృతి అందజేస్తారని వివరించారు. కార్మికులు మరణించిన సందర్భంలో అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సహాయం కూడా లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, ఇన్సూరెన్స్ కార్డులు పొందడం ద్వారా ఈ ప్రయోజనాలను పొందవచ్చని నర్రా గిరి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రాజు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్‌లో సిఐటీయు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**శామీర్ పేట్, మే 30(జనం సాక్షి )** సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సిఐటియు ఆఫీసు వద్ద శనివారం సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేశారు.ఈ కార్య క్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వై ఎల్లయ్య, సి గోపాల్, పెరుగు శ్రీనివాస్,కే వెంకటేష్, నరేందర్, ఆరోగ్యం,ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## అరుణోదయ కాలనీలో బిటి రోడ్డు రీకార్పెటింగ్ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మే 30 (జనం సాక్షి)** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ రోడ్ నెంబర్ 6లో తన హయాంలో మంజూరైన నిధులతో చేపట్టనున్న బి టి రోడ్డు రీకార్పెటింగ్ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్డు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. అభివృద్ధి పనులు ప్రారంభం కానుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## పోడు భూముల దురాక్రమణలను ఆపాలి

- గ్రామీణ పేదల సంఘం, ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు...



**ముషీరాబాద్, మే 30 (జనం సాక్షి):** ఫారెస్ట్ సరిహద్దులను నిర్ణయించే పేరుతో ప్రభుత్వం సాగిస్తున్న పోడు భూముల దురాక్రమణలను ఆపాలని గ్రామీణ పేదల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. వెంకటాద్రి, ఓ పి డి ఆర్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జితిన్ కుమార్, జి.విజయేందర్.లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో గిరిజన ప్రదర్శననిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నా భూమిలేని గిరిజన, గిరిజనేతర పేదలకు ఆ భూములపై పట్టాలని ఇచ్చి వారి సాగును చట్టబద్ధం చేయాలన్నారు. వ్యవసాయానికి అవసరమైన వసతులను సమకూర్చి వారి జీవనానికి జీవనోపాధికి సుస్థిరతనుకలిగించాలన్నారు. పోడు సాగు చేస్తున్న పేదలందరిని రికార్డులకు ఎక్కించి వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. టైగర్ జోన్ల పేరుతో గిరిజన గ్రామాలను ఖాళీ చేయించ వద్దనీ విజ్ఞప్తి చేశారు.

## చిలుకానగర్‌లో "మీ సురక్ష" కార్యక్రమం నిర్వహించిన ఉప్పల్ పోలీసులు

**ఉప్పల్, మే 30 (జనం సాక్షి):** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ ఉప్పల్ పోలీసులు చిలుకానగర్ ప్రాంతంలో "మీ సురక్ష" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే డ్రగ్స్ వ్యసనం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, అలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీలకు సంబంధించిన పలు



సమస్యలను ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు మరియు పోలీసుల మధ్య మరింత సమన్వయం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని వెల్లడించారు. చిలుకానగర్‌లో నిర్వహించిన ఈ "మీ సురక్ష" కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, ప్రజల భద్రత కోసం పోలీసులు చేపడుతున్న చర్యలను స్థానికులు అభినందించారు.

## ఉప్పల్ ఇండోర్ స్టేడియంలో పెరిగిన ఫీజులపై క్రీడాకారుల ఆందోళన



**ఉప్పల్, మే 30 (జనం సాక్షి):** ఉప్పల్ ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టు వినియోగ రుసుముల పెంపు క్రీడాకారుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త ఫీజుల విధానం కారణంగా సాధారణ కుటుంబాలకు చెందిన క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఆర్థిక భారం కాకుండా ప్రోత్సాహకరమైన వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు. ఉప్పల్ ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఇండోర్ స్టేడియానికి వచ్చి సాధన చేస్తున్నారు. ముఖ్యంగా బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత, ఉద్యోగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. అయితే తాజా రుసుముల పెంపు కారణంగా కొంతమంది క్రీడాకారులు తమ సాధన సమయాన్ని తగ్గించుకోవాల్సి వస్తోందని తెలిపారు. క్రీడలను అభివృద్ధి చేయాలంటే అందరికీ అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాలు అవసరమని క్రీడా ప్రేమికులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే క్రీడా కేంద్రాల్లో సామాన్యులకు అనుకూలంగా రుసుములు ఉండాలని అభిప్రాయపడ్డారు. క్రీడల ద్వారా యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటారని చెప్పారు. ప్రస్తుతం పెంచిన ఫీజుల కారణంగా కొందరు విద్యార్థులు, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాల సభ్యులు కోర్టు వినియోగంపై పునరాలోచన చేస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు ఫీజుల నిర్మాణాన్ని మరోసారి పరిశీలించాలని కోరుతున్నారు. అదేవిధంగా ప్రతిభ ఉన్న యువ క్రీడాకారులకు ప్రత్యేక రాయితీలు, నెలవారీ లేదా వార్షిక సభ్యత్వాల్లో సడలింపులు కల్పిస్తే మరింత మంది క్రీడల వైపు ఆకర్షితులవుతారని సూచించారు. ఉప్పల్ ఇండోర్ స్టేడియం రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందిన క్రీడా వేదికగా కొనసాగాలంటే క్రీడాకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన రుసుములపై సానుకూలంగా స్పందించి, క్రీడాకారులకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని ఎంఎంసీ కమిషనర్‌ను పలువురు క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు కోరారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ యువతను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపడితే ఉప్పల్ ప్రాంతంలో క్రీడా సంస్కృతి మరింత విస్తరించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికే పోస్ట్ ఆఫీస్

### అసిస్టెంట్ పోస్టల్ ఆఫీస్ సూపరిటెండెంట్ సంపత్ రెడ్డి




**శామీర్ పేట్, మే 30(జనం సాక్షి )** తుర్కపల్లి పోస్ట్ ఆఫీస్ లో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమంపై ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ జి. సంపత్ రెడ్డి అధ్యక్షతన తుర్కపల్లి పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు .ఈ సందర్భంగాపోస్టల్ అధికారి సంపత్ రెడ్డి మాట్లాడుతూ.. పోస్ట్ ఆఫీస్ లో గల పొదుపు ఖాతాలు అయినా సుకన్య సమృద్ధి ఖాతా , రికరింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్కమ్ స్కీమ్ ,కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్, తపాలా జీవిత బీమా , టైమ్ డిపాజిట్స్,సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ , అటల్ పెన్షన్ యోజన , పిఎంఎస్ బివై, పిఎంజేజే బివై, మరియు ఇన్సూరెన్స్ పథకాలు హెల్త్ ఇన్సూరెన్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకింగ్ తదితర సేవల గురించి గ్రామ ప్రజలకు సవివరంగా వివరించారు .ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా అలియాబాద్ మున్సి పాలిటీ కౌన్సిలర్లు దాసరి రవి , దీప, దీపికలు పాల్గొని పోస్ట్ ఆఫీస్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ సబ్ పోస్ట్ మాస్టర్ పి . సుధీర్ , తుర్కపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎన్ . సీతా మహాలక్ష్మి, వివిధ గ్రామాల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాలు ఎక్కడ?

- విద్యార్థులను అమ్మకాలకు పెట్టిన ప్రైవేటు పాఠశాల.
- అబ్బం శుభం తెలియని విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం.

**జిల్లేడు చౌదరి గూడెం (జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరి గూడెం మండల కేంద్రంలో ఓ ప్రవేట్ పాఠశాల విద్యార్థులజీవితాలతో చలగాటమాడుతుంది డిగ్రీ ఫెయిల్ అయిన వ్యక్తి చేతిలోకి దక్ష స్కూల్ వెళ్లడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు డాక్టర్‌గా పేరుగాంచాలంటే ఎంబిబి ఎస్ చదివి ఉండాలి ఉపాధ్యాయులుగా పేర్గాచాలంటే బిఎడ్. లేదా డైట్ ఉండాలి ఇలాంటి వ్యక్తులే పాఠశాలను నడపడానికి అర్హులుగా ప్రభుత్వం గుర్తిస్తుంది కానీ డిగ్రీ ఫెయిల్ అయిన వ్యక్తి చేతుల్లోకి దక్షి స్కూల్ వెళ్లడంతో అభం శుభం తెలియని విద్యార్థులజీవితాలతోచెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులు భావిస్తున్నారు ఇలాంటి పాఠశాలలను గుర్తింపు రద్దు చేయాలని కోరుతున్నారు.విద్యార్థి సంఘాలు చూసి చూడనట్లు గా వ్యవహరిస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎంఈఓ డిఈఓ విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రామంతపూర్ పెద్దచెరువు అభివృద్ధికి రూ.19 కోట్ల నిధులు

### చెరువు సుందరీకరణతో ప్రాంత రూపురేఖలు మారనున్నాయి: మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, మే 30 (జనం సాక్షి):** రామంతపూర్ పెద్దచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హైడ్రా ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పెద్దచెరువు ప్రాంతాన్ని సందర్శించి ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అధికారులతో ఆయన చర్చించారు. చెరువు అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువు పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం, పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పనులు పూర్తయితే రామంతపూర్ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు స్థానికులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. రామంతపూర్ పెద్దచెరువు అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతానికి కొత్త గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది

### ఆరోగ్యం, ఆర్థికాంశాలపై శ్రద్ధ వహించాలని కమిషనర్ సూచన: సిపి సుమతి.



**మల్కాజిగిరి మే 30(జనంసాక్షి)** పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సుదీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో సేవలు అందించడం అభినందనీయమని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం విధి నిర్వహణ నుండి పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీస్ అధికారులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా పనిచేసిన అధికారులు, పదవీ విరమణ అనంతరం తమ విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. వయస్సు రీత్యా ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆమె సూచించారు. రిటైరైన అధికారులకు రావాల్సిన అన్ని రకాల రిటైర్మెంట్ ప్రయోజనాలను త్వరగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.పదవీ విరమణ పొందిన కే. కరుణ సాగర్, పి. బాలరాజు, టి. ప్రభాకర్, మహమ్మద్ అలీ, ఎం.అంజిరెడ్డి, జి. నరేందర్ రెడ్డి లను సీపీ సుమతి శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో డీసీపీ ఇందిరా, అడిషనల్ డీసీపీ శివకుమార్, సీఏఓ శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ఏసీపీ రవీంద్ర రెడ్డి, భద్రారెడ్డి, రమేష్, నాయుడు, ప్రదీప్ కుమార్, బాలరాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిల్కమర్రి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి చేసిన సేవలు వెలకట్టలేనివి

### బిఆరెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కంటే శ్రీశైలం




**జనంసాక్షి ఫరూఖ్ నగర్** మా గ్రామానికి మీరు చేసిన సేవలు వెలకట్టలేనివని, మీరు ఎక్కడికి వెళ్లిన మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని బిఆరెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కంటే శ్రీశైలం అన్నారు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి బదిలీ సందర్భంగా ఆమెను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంటే శ్రీశైలం మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా మా ఊరి గ్రామ పంచాయతీలో సేవలందిస్తూ పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు.రెండు సంవత్సరాలు సర్పంచులు లేకపోయినా మా గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందు ఉంచారని అన్నారు.మా గ్రామాన్ని అభివృద్ధి పథం లో నడిపి ఉత్తమ గ్రామ పంచాయతీ ఆవార్డు రావడంలో మీ పాత్ర ఎంతో కీలకమని అభినందించారు.మీరు ఎక్కడికి వెళ్లి ఆ గ్రామాన్ని సైతం అభివృద్ధి చేసి మంచి పేరుప్రఖ్యాతలు సాధించాలని వివరించారు. మీరు చేసిన అభివృద్ధి విషయంలో మేము ఎప్పుడు కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ,నర్సింహా రెడ్డి, జర్నలిస్ట్ నరేష్,బిఆరెస్ నాయకులు శ్రీనివాస్,వార్డు సభ్యులు చంద్ర శేఖర్,రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడివయ్య, బ్యాగరి భీమయ్య, సూరారం శ్రీశైలం, గంగపురం నర్సింహా, బ్యాగరి బాల్ రాజు, మల్లేష్, శ్రీను, అంజి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోసెస్ దేవదాస్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** నగరానికి చెందిన మోసెస్ దేవదాస్ లార్జెస్ట్ ఎలక్ట్రానిక్ కీబోర్డ్ ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 777 మంది సంగీత కళాకారులు పాల్గొన్న "లార్జెస్ట్ ఎలక్ట్రానిక్ కీబోర్డ్ ఎన్సెంబుల్" (అతిపెద్ద ఎలక్ట్రానిక్ కీబోర్డ్ బృందం) ప్రదర్శనలో ఆయన భాగస్వామిగా మారి ఈ అరుదైన రికార్డును సాధించారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 2న సికింద్రాబాద్‌లోని జొరాస్ట్రియన్ క్లబ్‌లో ఈ భారీ సంగీత కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సంగీత కార్యక్రమంలో 777 మంది సంగీత కళాకారులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. అందులో పాల్గొన్న మోసెస్ దేవదాస్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డు అధికారిక సర్టిఫికేట్, మెడల్‌ను అందించారు. ఈ అవార్డును వైబిహెచ్‌ఎం అండ్ హెచ్‌ఎంఎస్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ అగస్టిన్ డిండింగి చేతుల మీదుగా అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ కీర్తిని చాటిన మోసెస్ దేవదాస్‌ను ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

# ఫార్మాసిటీ జీవో 31ను రద్దు చేయాలి

### ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సరస్వతి కవుల



**ముషీరాబాద్, మే 30 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా ఫార్మాసిటీ జీవో 31ను రద్దు చేయాలని, అక్రమ భూ సేకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చిన భూముల్లో ప్రభుత్వం తక్షణమే పనులు మానుకోవాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సరస్వతి కవుల డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్, ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద శనివారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సామూహిక ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో ప్రజా సంఘాల,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ సరస్వతి కవుల మాట్లాడుతూ గ్రీన్ ఎక్స్ ప్రెస్ హైవే రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో టీచర్ సిటీ పేరుతో రైతుల భూములను కొల్లగొట్టడం మానుకోవాలని, పర్యావరణాన్ని దెబ్బతీసే ఫార్మాసిటీ , ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ధర్నాలో కన్నెగంటి రవి, డాక్టర్ కే బాబు మట్టి మనిషి పాండు రంగారావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు నిర్లక్ష్యన్ని విడనాడి



**హయత్ నగర్, మే 30 (జనం సాక్షి)** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీ, కమలా నగర్, శారదా నగర్ కాలనీలలో ఉన్న వరద నీటి కాలువల్లో ఇప్పటి వరకు పూడిక తీయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని, దీనివల్ల కాలువల ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయి ప్రజల్లో ఆందోళన నెలకొంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం వ్యర్థాలను వెంటనే తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాలు ప్రారంభమైన అనంతరం కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉండటంతో కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు. గతంలో కూడా భారీ వర్షాల సమయంలో పలు ప్రాంతాలు జలమయమైన సందర్భాలు ఉన్నందున ముందస్తు చర్యగా కాలువల పూడిక తొలగింపు పనులు చేపట్టి వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకముందే వెంటనే స్పందించి కాలువల శుభ్రపరిచే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

## అమరుల వారోత్సవాలను జయప్రదం చేయండి



ముషీరాబాద్, మే 30 (జనం సాక్షి): తెలంగాణ సాధనకు ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకుంటూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమోని నాగభూషణం పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాదు. గన్ పార్క్ వద్ద తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మే 26న లలితక్క వర్ధంతి, జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ అమరుల వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కడమంచి రాంబాబు, కోశాధికారి ముత్తన్న, హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కొల్లూరి అంజయ్య, నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నిక సంఘం కార్యదర్శి లింగ్యా నాయక్



**మల్కాజిగిరి మే 30 (జనంసాక్షి)** రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి జి లింగ్యా నాయక్ ఆనంద్ బాగ్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి శాలువా తో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, డా తులసి వెంకట రమణా చార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్ , భక్తులు మూర్తి, శ్రీదేవి, తులసి, విజయ లక్ష్మీ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## బైకు చెట్టును ఢీ కొని ఓ వ్యక్తి మృతి



**చేవెళ్ల, మే 30 (జనంసాక్షి)** బైకు చెట్టును ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి అంతారం గ్రామ సమీపంలో సంఘటన చోటుచేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య(32) షాబాద్ మండలం హైతాబాద్ లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వారం రోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం పని మీద తన బైకు పై చేవెళ్ల మండల కేంద్రంకు వెళ్లి పని ముగించుకొని తిరిగి రాత్రి 7 గంటల సమయంలో గ్రామానికి బయలు దేరాడు. గ్రామానికి సమీపంలోకి బైకు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టడంతో ఎగరిపడటంతో తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. వెంటనే గ్రామస్తులు చూసి అతడిని 108 వాహనంలో చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలకు తరిలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు రఘువర్దన్ నాలుగవ తరగతి, కూతురు లహీరీ మూడవ తరగతి చదువుతున్నారు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయిన ఆ పిల్లలను చూసి ప్రతి ఒక్కరు కంటతడిపెట్టారు.

## బాటసింగారం సహకార సంఘం మహాజన సభలో వాడివేడి చర్చలు

- రైతులకే ప్రాధాన్యతనిచ్చే రుణ విధానం అమలు చేస్తున్నాం: చైర్మన్ జైపాల్ రెడ్డి
- అవకతవకల ఆరోపణలను ఖండించిన మాజీ చైర్మన్ చేగూరి భరత్



**అబ్దుల్లాపూర్మెట్, మే 30 (జనం సాక్షి ):** బాటసింగారం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ 58వ మహాజన సభ సమావేశం శనివారం అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలోని సంఘు కార్యాలయ ఆవరణలో సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సంఘ వార్షిక కార్యకలాపాలు, పరిపాలన, రుణాల పంపిణీ, బకాయిల వసూళ్లు తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ సంఘ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు అందించే రుణ పరిమితిని రూ.15 లక్షలకు పెంచినట్లు తెలిపారు. నిజమైన రైతులకు మాత్రమే రుణాలు అందించాలనే ఉద్దేశంతో రుణ విధానంలో మార్పులు చేపట్టామని చెప్పారు. గత పాలకవర్గ హయాంలో వ్యవసాయ భూములు లేని కొంతమందికి ప్లాట్ల ఆధారంగా రుణాలు మంజూరు చేయడం జరిగిందని, వాటిలో అనేక రుణాలు ఇప్పటికీ వసూలు కాలేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రైవేట్ ప్లాట్ల ఆధారంగా రుణాలు మంజూరు చేసే విధానాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. బకాయి రుణాల వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నామని, ఒక్క రూపాయి కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. మాజీ అధ్యక్షుడు విట్టల్ రెడ్డి పలుమార్లు నిర్వహించిన జనరల్ బాడీ, ఎంసీ సమావేశాలకు హాజరు కాలేదని, నిబంధనల ప్రకారం సభ్యత్వ రద్దుకు అవకాశం ఉందని తెలిపారు. అనంతరం సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్ 2025 అక్టోబర్ 1 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు సంఘ పరిపాలన నివేదికను సభకు సమర్పించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, డెయిరీ రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులను ఆదర్శ రైతులుగా ఎంపిక చేసినట్లు వివరించారు. సమావేశంలో మాట్లాడిన మాజీ అధ్యక్షుడు చేగూరి భరత్ కుమార్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాను అర్హులైన వారికి మాత్రమే రుణాలు మంజూరు చేశానని తెలిపారు. సంఘ నిధుల వ్యయంపై ప్రశ్నిస్తూ రూ.4.76 లక్షల ఖర్చుకు సంబంధించి రైతులకు పూర్తి వివరాలు వెల్లడించాలని మేనేజర్ ఐలేష్‌ను కోరారు. సమావేశం అనంతరం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్ చేతుల మీదుగా ఆదర్శ రైతులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం, ఇనాంగూడ సర్పంచ్ దేశారం రాఘవేందర్, మజీద్‌పూర్ సర్పంచ్ శేఖర్, కవాడిపల్లి సర్పంచ్ కొలను ప్రసన్న లక్ష్మీ రవీందర్ రెడ్డి, సంఘ ఉపాధ్యక్షులు మల్లమ్మ జంగమయ్య యాదవ్, డైరెక్టర్లు గుండె బాల నర్సమ్మ, మొగుళ్ల చిన్న యాదిరెడ్డి, పగిళ్ల బాల్‌రెడ్డి, బిజిలి బాల నర్సయ్య, గుంట శ్రీనివాస్ రెడ్డి, ఇటికేల మహేందర్ రెడ్డి, మేకల రాములు యాదవ్, చింతల లక్ష్మమ్మ, కందాడి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో రైతులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి : ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కాప్రా, మే30 ( జనం సాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ లయన్స్ క్లబ్ బిల్డింగ్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సార్, బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి , కాసం మైపాల్ రెడ్డి , పెద్దాపురం కుమారస్వామి , బేతాళ బాలరాజు, షేర్ మణమ్మ, మురళి పంతులు, శిరీష, సింగారపు మనమ్మ సత్తమ్మ, గొల్ల పద్మ, రమేష్ చారి, రహీం, మాట్ల గిరి, ఓట్ల మొగిలయ్య, రత్నాల కనకయ్య, ఎన్ రమేష్ , ఈ భాస్కర్, సింగారపు రాజు, పాషా, మన్సూర్, సత్యనారాయణ గౌడ్, సత్యనారాయణ, మల్లికార్జున, బాలయ్య, సరిత, మాలతి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివోఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

### నవాబ్పేట్ మండల ఐకెపి వివోఏల అధ్యక్షురాలు జయమ్మ. కోశాధికారి రమాదేవి!!



**నవాబుపేట్ మే 30 (జనం సాక్షి);** నవాబుపేట్ మండల ఐకెపి కార్యాలయం వద్దవివోఏ జాయింట్ యాక్షన్ కమిటీ సెర్ప్ పిలుపులో భాగంగా మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల వివోఏలు నిరువదిక సమ్మె చేపట్టారు. నేటికీ 12రోజులు చేరుకుంది. వివోఏలకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వంఆధ్వర్యంలో వివో ఏ లకు మద్దతు తెలిపి నిరవధిక సమ్మెలో కూర్చొని వారికి సంఘీభావం తెలిపారు. వివో ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల చేస్తున్నామని ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఆశపడటం తప్ప మహిళలకు చేసింది ఏమీ లేదని అన్నారు వివో ఏ లకు కనీసం వేతనం 26వేలు ఇవ్వాలి కోరారు వివోల అధ్యక్షురాలు జయమ్మ, కోశాధికారి రమాదేవి మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి 26వేల వేతనం పెంచాలి. ప్రభుత్వం ఇచ్చే 5 వేల రూపాయలు ఆఫీసుకు రావడం పోవడం ఖర్చులకి సరిపోవడం లేదు అందుకని హెచ్ఆర్ పాలసీ అమలు చెయ్యాలి అర్హత కలిగిన వివో ఏ లకు సీసీ లుగా పదోన్నతి కల్పించాలి. సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం 20లక్షలు కల్పించాలి... 58 జీవోను సవరించాలి వారి న్యాయమైన డిమాండ్ పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం వివోఏలకు వంటల కార్యక్రమాన్ని నిర్వహించారు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో, మండల ఐకెపి వివోఏల సంఘ అధ్యక్షురాలు, జయమ్మ, కోశాధికారి రమాదేవి,వి ఏవోల సభ్యులు, విజయ, రాజ్యలక్ష్మి, సుజాత, విమల, గాయత్రి, జగన్, ఎల్లారెడ్డి, స్వప్న, సుమలత, కవిత, శోభ, సువర్ణ, నాగరాణి, వివిధ గ్రామాల వివోఏలు ఐకెపి సీసీలు పాల్గొన్నారు.

# పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప

## కార్మికుల వర్గ పోరాటాలే సమస్యలకు పరిష్కారం: ఎం చంద్రమోహన్, ఆలేటి ఎల్లయ్య

**హయత్ నగర్, మే 30 (జనం సాక్షి)** ఎల్బీనగర్ కన్వీనిగ్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పొట్టేపాకు రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో 55 సంవత్సరాలు పూర్తి చేసుకుని 56 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకరమని వారు అన్నారు. కార్మిక లోకానికి యావత్ భారతదేశంలో ఈరోజు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) కార్మిక సంఘం దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ "పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు" అనే నినాదంతో ముందుకు పోతున్న సంఘం ఏదైనా ఉంది అంటే అది సిఐటియు అని గర్వంగా చెప్పుకోవచ్చు. దేశంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, రాష్ట్రాల్లో చాలా బలంగా ముందుకు కొనసాగుతూ జిహెచ్ఎంసి వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనము, హమాలీ, ట్రాన్స్పోర్ట్ రంగం, పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ దేశంలో ఒక పేరుగాంచిన ట్రేడ్ యూనియన్ అని మనం గర్వంగా చెప్తున్నాము. నిరంతరం పోరాటం చేస్తూ, కార్మిక వర్గానికి అండగా నిలబడుతూ ఈ



ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి మన హక్కుల సాధన కోసం పోరాడుతున్నాము. ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లపై అవగాహన కల్పిస్తూ, రానున్న కాలంలో కార్మిక వర్గానికి జరిగే నష్టాలను తెలియజేస్తూ, నిరంతరం కార్మికులకు అండగా పోరాటాలు చేస్తున్నాము. కార్మిక సంఘానికి యావత్ కార్మికులందరూ ఏకమై, ముందు కొనసాగించాలని, రానున్న కాలంలో కార్మికుల ఇబ్బందులకు గురి చేసే చట్టాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాలని వారు తెలియజేశారు. ఇండ్లు, ఇళ్లస్థలాల కోసం ప్రభుత్వ స్పందించకుంటే, భవిష్యత్తులో కార్మికులందరినీ సమీకరించి, ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను గుర్తించి ఎర్రజెండాలు కట్టి, కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దండు రాధ, బి.కాశయ్య, కృష్ణమూర్తి, రాథోడ్, అంజి, లింగస్వామి, రాధమ్మ, లక్ష్మణ్ నాయక్, గంగమ్మ, అంజమ్మ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ట్యాంకర్ డ్రైవర్‌పై దాడిని ఖండించిన ది సిటిజన్స్ కౌన్సిల్



**రాజేంద్రనగర్,మే30(జనంసాక్షి)** మణికొండలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మణికంఠపై జరిగిన దాడి కలకలం రేపింది. శనివారం ఉదయం జరిగిన దాడిని ది సిటిజన్స్ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. అంజలి గార్డెన్స్‌కు చెందిన మణికంఠ నీటి సరఫరా కోసం నిర్దేశిత ప్రాంతానికి ట్యాంకర్‌తో వెళ్లగా, ఓ వినియోగదారుడు నీటిని వేరే ప్రాంతానికి సరఫరా చేయాలని ఒత్తిడి చేశాడు.విధి నిబంధనలకు విరుద్ధంగా నీటిని మళ్లించేందుకు డ్రైవర్ నిరాకరించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఆ వినియోగదారుడి సోదరుడు డ్రైవర్‌పై దాడి చేయగా, ఆయన ముక్కు నుంచి రక్తస్రావం జరిగి గాయాలపాలైనాడు. ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ది సిటిజన్స్ కౌన్సిల్, ప్రజలకు తాగునీరు అందించేందుకు కష్టపడి పనిచేస్తున్న ట్యాంకర్ డ్రైవర్లు వంటి ప్రజాసేవా సిబ్బందిపై దాడులు ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొంది.దాడికి పాల్పడిన వారిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ డిమాండ్ చేసింది.

# మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



**కాప్రా, మే 30 (జనం సాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంత్రి శ్రీధర్ బాబును కలిసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి శ్రీధర్ బాబు చేస్తున్న సేవలు మరువలేని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి నాయకులు సీతారాం రెడ్డి, నాగిళ్ల బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, యాదగిరి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులు ఇందిరమ్మ ఇళ్లు సోలార్ ప్లాంట్‌పై సమీక్ష చేసినా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**కోట్ పల్లి మే 30(జనంసాక్షి)** కోట్ పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామాల్లో వీకరాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ శనివారం విస్తృతంగా పర్యటించారు.డీఆర్డీఓ, అడిషనల్ డీఆర్డీఓ అధికారులతో కలిసి ఉపాధి హామీ పనులు,స్వయం సహాయక సంఘాల సోలార్ ప్లాంట్,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి కూలీలతో ముఖాముఖి. బార్వాద్ లో ఉపాధి హామీ పని స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, కూలీలతో నేరుగా మాట్లాడారు. రోజువారీ వేతనాలు, పని రకాలు,బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లతో హాజరు శాతం,పని స్థలంలో కల్పిస్తున్న వసతులపై సమీక్షించారు.అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించగా,సంబంధిత శాఖలతో మాట్లాడి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఎస్‌హెచ్‌జీ పనులకు డెడ్‌లైన్. అనంతరం స్వయం సహాయక సంఘాల పనుల పురోగతిని పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తే మండలానికి అదనంగా మరో భవనం మంజూరు చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, అర్హులైన లబ్ధిదారులందరినీ గుర్తించి పథకంలో భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.సోలార్ ప్లాంట్‌లో మహిళల ప్రతిభకు ప్రశంస.మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న 'ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్



ప్లాంట్'ను అధికారుల బృందం సందర్శించింది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇన్వర్టర్లు, ఇతర సాంకేతిక పరికరాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ప్లాంట్ ద్వారా ఎంతమంది మహిళలకు ఉపాధి లభిస్తోంది, వారికి ఇచ్చిన సాంకేతిక శిక్షణ వివరాలను ఆరా తీశారు.మరిన్ని ప్రాజెక్టులకు హామీ. "ఈ సోలార్ పవర్ ప్లాంట్‌ను మహిళలు విజయవంతంగా నిర్వహిస్తే మండలానికి మరిన్ని కొత్త ప్రాజెక్టులు, నిధులు కేటాయించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది" అని కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. మహిళలతో పాటు పురుషులకు కూడా పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించేలా కొత్త పరిశ్రమలు, ప్రాజెక్టులను తీసుకొస్తామని, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ ,ఎంపీడీఓ, హేమంత్ ఎంపీపీ,సురేందర్ రెడ్డి సర్పంచ్ ప్రతిభ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలి

## సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**చేవెళ్ల, మే 30 (జనంసాక్షి)** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను తెలుసుకునేందుకు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు రాజు ఆధ్వర్యంలో గ్రామాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త ఆన్ లైన్ విధానం, ఫొటో హాజరు విధానం కారణంగా కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆన్ లైన్ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో కూలీలు పనులకు హాజరు కావడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీంతో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వారి సంఖ్య కూడా తగ్గుతోందని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ, ఆన్ లైన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు రాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**ఇబ్రహీంపట్నం,మే 30(జనం సాక్షి )** మంచాల మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మండల వ్యాప్తంగా ఎంపికైన 53 మంది లబ్ధిదారులకు తన చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ప్రసాదరావు, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, మంతని శివయాధవ్, పెర్కా మూర్తి, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, ముచ్చర్ల వెంకటేష్, కందకట్ల జైపాల్ రెడ్డి, యశమోని శేఖర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, కొంకని విజయ్, రావుల నాగరాజు, భరత్ రెడ్డి, కసరమోని రాజేష్ యాదవ్, జనార్దన్, సత్యం, ఆర్ల ప్రవీణ్, కుకూడాల నరేందర్ రెడ్డి, కొల్లోజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ సహజమే

- మండల సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్‌రెడ్డి
- ఎస్పీకు మన సన్మానం




**మొయినాబాద్, మే 31, జనంసాక్షి:** ఉద్యోగ రిత్య పదవీ విరమణ ఉద్యోగులకు సహజమేనని వని చేసిన చోట ప్రజలకు సేవలు అందించినప్పుడే ప్రజలు గుర్తిస్తారని మొయినాబాద్ మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్లో ఎస్పీ నరేందర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సభకు మొయినాబాద్ మండల సర్పంచ్ సంఘం సభ్యులు తరలివెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్‌రెడ్డి సభ్యులతో కలిసి ఎస్పీ నరేందర్‌రెడ్డిని సన్మానించి ఆయన మాట్లాడుతూ ఉద్యోగ రిత్య పదవీ విరమణ సహజమేనని అన్నారు. ఉద్యోగులు ఎక్కడ వని చేసిన అక్కడి ప్రజలకు న్యాయబద్ధంగా వని చేసినప్పుడే ఆ ప్రజలు ఆ ఉద్యోగులను ఎన్నటికి మరచిపోలేరని గుర్తు చేశారు. ఎస్పీ నరేందర్‌రెడ్డి సన్మాన సభకు ఎంతో మంది రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వలువురు సర్పంచ్లు, నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ గారిని కలిసిన కోమిడి వెంకటరెడ్డి



**మొయినాబాద్, మే 30 జనం సాక్షి :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జాతీయ నాయకురాలు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ గారితో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు,కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు కోమిడి వెంకటరెడ్డి గారు, మీనాక్షి నటరాజన్ గారితో మర్యాద పూరవకంగా ఈ రోజు గాంధీ భవన్ లో కలవడం జరిగింది

## వెంకట్ రెడ్డి మాతృమూర్తికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ



**కాప్రా, మే 30 (జనం సాక్షి ) :** చర్లపల్లి పారిశ్రామిక వాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొమ్మెర వెంకటరెడ్డి మాతృమూర్తి కొమ్మెర సౌందర్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండార్ లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కోదండరాం శనివారం వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి జన్ శేకర్, జె .ప్రభాకర్ రెడ్డి, గంధం నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ



**చేవెళ్ల, మే 30 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వార్డు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కౌన్సిలర్ కరికె మీనాక్షి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మనసురాబాద్ డివిజన్‌లోని పలు సమస్యల పరిష్కారానికి కృషి

### హామీ ఇచ్చిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవ్‌రెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, మే 30 ( జనం సాక్షి)** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సిరిహిల్స్ కాలనీలో నిర్వహించిన డ్రైనేజీ పనులు, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో సుమారు 500 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్ల కొరత ఉన్నందున కొత్త లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో రహదారులు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిసర కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కు కాలనీ లలో ఉన్న పలు సమస్యలను వివరించి, వినతిపత్రాలు అందజేశారు. వాటిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జక్కిడి రఘువీర్ రెడ్డి, ట్రస్ట్ తరపున కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి 1,00,000/- లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులు ఐక్యంగా ముందుకు సాగితే అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని, సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, రామచంద్రరెడ్డి, అనిల్ కుమార్, కెకెవల్ గౌడ్, సందీప్, సిరి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, గౌరవ అధ్యక్షులు రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కరుణాకర్, కోశాధికారి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ మురళి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారశీ చేయాలి



**తాండూరు మే 30(జనంసాక్షి)** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు )ఆధ్వర్యంలో తాండూర్ మండలం ఎం పి ఓ చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారశీ చేయాలని, కార్మికుల వేతనాలు నేరుగా వారి ఖాతా(గ్రీన్ ఛానల్)ద్వారా నే వేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గత 40 సంవత్సరాలుగా పనిచేసిన సరియైన సమయానికి వేతనాలు రాని పరిస్థితి పంచాయతీ కార్మికులు పస్తులుండి అప్పుల పాలవుతూ దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల పని ఒత్తిడి పెరిగి అనేక మంది కార్మికుల చనిపోయిన దుస్థితి ఉందని అన్నారు.గత నాలుగు నెలలుగా వేతనాలు కార్మికులకు అందక ఇబ్బందులు పడుతున్నారని మార్చి రెండవ తేదీన సర్పంచులే వేతనాలు చెల్లిస్తారని పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారని ఈ విధానం వల్ల గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం మీద అనేక పోరాటాల ఫలితంగా టీఎస్పీ బిపాస్ ద్వారా వేతనాలు చెల్లించారని సిబ్బందికి వేతనాలు అందరిని పరిస్థితిలో స్వయంగా ముఖ్యమంత్రి 2025 జనవరి నుండి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన మాట ఇప్పటికీ అమలు కాకపోవడం నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ మేనిఫెస్టోలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు కాకపోవడం గత ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి తీసుకొచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని కొనసాగించడం ఈ ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల దుర్భరంగా వ్యవహరిస్తున్నది అన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 51 సవరించాలని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని గతంలో ఉన్నటువంటి వివిధ కేటగిరీలను అమలు చేయాలని కారోబార్ బిల్ కలెక్టర్ లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని పంచాయతీలో పనిచేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని రెండో పిఆర్సి పరిధిలోకి కార్మికులను తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని అందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పంచాయతీ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, దహన ఖర్చులను నిమిత్తం ఉన్నటువంటి 10000 రూపాయలు కాకుండా 30 వేల రూపాయలు చెల్లించాలని కోరుతూ మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు పై డిమాండ్ చేశారు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన అమలు చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1వ తేదీన మండల ఎంపీడీవో ఆఫీస్ ల ముందు ధర్నాలను గ్రామపంచాయతీ కార్మిక వర్గం అందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తాండూరు మండల నాయకులు వెంకటప్ప జగన్ నారాయణ వెంకటేష్ శ్రీనివాస్ అంజిలప్ప లక్ష్మి రవికుమార్ సక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యకు పరిష్కారం

### 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణ రెడ్డి.



**తాండూరు మే 30 (జనంసాక్షి)** మున్సిపాలిటీ 24వ వార్డులో నెలకొన్న త్రాగునీటి సమస్యకు పరిష్కారంగా నూతన బోరు మోటారును ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్, 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణ రెడ్డి మరియు మున్సిపల్ కమిషనర్ సహకారంతో ఈ ఏర్పాటు పూర్తయింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ పి. బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ వార్డు ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ, ఏఈ, వార్డు అధికారి స్నేహలత, ఆర్.పి శ్రీదేవితో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతన బోరు మోటారు ఏర్పాటుతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.